ప్రజా మంటలు

గురువారం 10- 09 - 2026

# వీల్‌చైర్‌పై వచ్చి ఎన్నికల సంఘానికి వివరాలు సమర్పించిన వికలాంగుడు

**గొల్లపల్లి మండలానికి చెందిన రాపల్లి లక్ష్మణ్**



**గొల్లపల్లి, సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు):** ఎన్నికల సంఘం తరఫున నోటీసులు జారీ కావడంతో తన వివరాలకు సంబంధించిన ఆధారాలను సమర్పించేందుకు ఓ వికలాంగుడు వీల్‌చైర్‌పై గొల్లపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చాడు. గ్రామపంచాయతీ ఆవరణలో ఎన్నికల సంఘం అధికారులు జారీ చేసిన నోటీసుల మేరకు అవసరమైన పత్రాలు, ఆధారాలను సమర్పించేందుకు ఆయన స్వయంగా వీల్‌చైర్‌పై వచ్చి అధికారులకు అందజేశారు. తనకు ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ బాధ్యతగా వివరాలు సమర్పించేందుకు వచ్చిన ఆయనను పలువురు అభినందించారు.

# రాజేశం గౌడ్‌ను పరామర్శించిన నేతలు





**హైదరాబాద్: సెప్టెంబర్ 09 ( ప్రజా మంటలు):** మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, మాజీ తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరు సంజయ్ కుమార్ రావు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ గౌడ్ వేర్వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్, పితాని సత్యనారాయణ గౌడ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలిసి పనిచేసిన రోజులను, తమ సుదీర్ఘ స్నేహానుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకి సన్మానం



**వెల్గటూర్ సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు)** : వెల్గటూర్ మండల స్థాయిలో జరిగిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల లో భాగంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లకు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భం లో జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్న గుగ్గిళ్ళ రవీందర్,ఎ స్తంభంపల్లిని ఎంపీడీవో,ఏమేవవ లు సన్మానించారు. ఇదే పాఠశాల నుండిబి. రాజేశ్వరి మండల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారశీ అందుకోన్నారు. భావి భారత పౌరులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని వెల్గటూర్ ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో కోటిలింగాల చైర్మన్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,మార్కెట్ కమిటీ చైర్మన్,మరియు పలువురు నాయకులు ,సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు...

# మున్నూరు కాపు సంఘము వారి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**-కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ప్రజాప్రతినిధులు**





**వెల్గటూర్, సెప్టెంబర్ 9 (ప్రజా మంటలు)** : జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్ మండలం లోని స్తంభం పల్లి గ్రామంలో గల స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు విధులు నిర్వహిస్తున్న పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు జి రవీందర్ ఇటీవల కాలంలో జగిత్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శుభ సందర్భంగా వారికీ స్తంభం పెల్లి గ్రామ పంచాయతీ నాలుగవ వార్డు సభ్యురాలు అయినా పాదం అంజలి వారి కమిటీ సభ్యులతో కలిసి బుధవారం రోజు మధ్యాహ్నం వేళలో వారికీ శాలువా కప్పి ఏంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమ తధానంతరం స్తంభం పల్లి గ్రామ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు విధులు నిర్వహిస్తున్న గీత ఇటీవల కాలంలో వెల్గటూర్ మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నిక అయినా శుభ సందర్భంగా వారికీ కూడా శాలువా కప్పి ఏంతో ఘనంగా సన్మానించారు.ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మాజీ ఛైర్ పర్సన్ పాదం లావణ్య, కాంగ్రెసు పార్టీ స్తంభం పల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు హరి ప్రశాంత్, కాంగ్రెసు పార్టీ స్తంభం పల్లి గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడు గుర్రం మహేష్, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారుద.

# ప్లాస్టిక్ రహిత రేచపల్లి దిశగా మరో అడుగు

**ఆకులతో విస్తరాకుల తయారీ మిషన్‌ను ప్రారంభించిన సర్పంచ్ బాస మహేష్**



**గొల్లపల్లి సెప్టెంబర్ 9ప్రజా మంటలు :** సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామం లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. ఇటీవల రేచపల్లిలోని జగన్నాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఆయన ప్రజలకు వివరించారు.ఎమ్మెల్యే సూచనలతో స్ఫూర్తి పొందిన రేచపల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల రాధా--మల్లేష్ కుటుంబం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా ఆకులతో విస్తరాకులు, ప్లేట్లు తయారు చేసే మిషన్‌ను కొనుగోలు చేసి గ్రామానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాస మహేష్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే నష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు సాధ్యమైనంత వరకు ఆకులతో తయారు చేసిన విస్తరాకులు, ప్లేట్లను వినియోగించాలని కోరారు.ప్లాస్టిక్ రహిత గ్రామంగా రేచపల్లిని తీర్చిదిద్దేందుకు పాలకవర్గం చేస్తున్న కృషికి స్పందించి ఆకులతో ప్లేట్ల తయారీ మిషన్‌ను ఏర్పాటు చేసిన ఒడ్నాల రాధా--మల్లేష్ కుటుంబానికి సర్పంచ్ బాస మహేష్,పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ద

# కాళోజీ జయంతి సందర్భంగా రేకుర్తిలో ఘన నివాళులు



**కరీంనగర్ సెప్టెంబర్ 09 )ప్రజా మంటలు);:** "అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి.. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్ని ఎదిరించిన వాడే నా ఆరాధ్యుడు" అని సగర్వంగా ప్రకటించి, ఉద్యమాన్నే ఊపిరిగా జీవించిన తెలంగాణ తొలిపొద్దు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని రేకుర్తిలో ఘనంగా నివాళులు అర్పించారు.రేకుర్తిలోని కాళోజీ నారాయణరావు విగ్రహానికి తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్త అనిల్ కుమార్, కార్యదర్శి దొమ్మటి శంకర్ ప్రసాద్, సాయిల్ల శ్రీనివాస్ పూలమాలలు వేసి ప్రణామాలు అర్పించారు.ఈ సందర్భంగా కాళోజీ ఆశయాలను స్మరించుకుంటూ, ప్రజల సమస్యలపై నిరంతరం గొంతెత్తిన ఆయన సాహిత్య, సామాజిక, ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. అన్యాయాన్ని ప్రశ్నించడం, ప్రజల పక్షాన నిలబడటం, సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడం ద్వారా కాళోజీ చూపిన మార్గాన్ని నేటి తరం రచయితలు కొనసాగించాలని వారు పేర్కొన్నారు.

# దామెర విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

**రైతులకు 3-ఫేజ్ కరెంట్, గ్రామానికి 33 లైన్ ఏర్పాటు చేయాలి**





**ఎల్కతుర్తి సెప్టెంబర్ 9 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. దామెర గ్రామానికి ప్రస్తుతం ఉన్న 33ఖఒ విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ లైన్ లేకపోవడంతో, చిన్న సాంకేతిక సమస్య వచ్చినా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. దీనివల్ల తాగునీటి సరఫరా, విద్యార్థుల చదువులు, వ్యాపారాలు, రోజువారీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు.ముఖ్యంగా రైతులకు 3-ఫేజ్ విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో పొలాలకు నీరు పెట్టుకోలేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.ఈ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేసి, దామెర గ్రామానికి లైన్ ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు 3-ఫేజ్ విద్యుత్ సక్రమంగా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.అధికారులు వెంటనే స్పందించి లైన్ కోసం సర్వే, అంచనాలు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని, అలాగే వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత కాకుండా, ఇప్పుడే విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లెపాటి మాధవరావు, ప్రధాన కార్యదర్శులు చిరురాల వెంకటేష్, అల్లి కుమార్, కార్యదర్శి కోడం రమేష్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి సంపత్ రావు, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, జనానికిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, సల్వాల కిరణ్. ఠాకూర్ శాంసింగ్.చీరాల రంజిత్, మాధవరావు.తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలే లక్ష్యం





**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 9: ప్రజా మంటలు :** సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్‌లో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠశాల నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ప్రధాన విద్యార్థి నాయకుడు, సహాయ ప్రధాన విద్యార్థి నాయకుడు, క్రీడా విభాగం ప్రతినిధుల ఎంపిక కోసం ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు.అభ్యర్థులు తమ లక్ష్యాలు, ఆలోచనలను తోటి విద్యార్థులకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం విద్యార్థులు తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేసి నాయకులను ఎన్నుకునే విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, బాధ్యత, సమిష్టి భావన, నిర్ణయాత్మకత వంటి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతితో పాటు ఉపాధ్యాయులు సరిత, లావణ్య, ఆశా బేగం, సురేష్, రమేష్, కృష్ణ, మమత, కవిత, లలిత తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# 70 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైన విద్యార్థులు



**మెట్టుపల్లి సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** మెట్టుపల్లి మండలం లోని వెల్లుల్లలో జరిగిన 70 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి చదరంగం సెలెక్షన్స్ జరిగినవి. ఇందులో మెట్టుపల్లి మండలం లోని ప్రైవేట్, ప్రభుత్వ, రెసిడెన్సీయల్ విద్యార్థులు అండర్ -14,అండర్ -17 విభాగంలో బాలురు, బాలికలు దాదాపు 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నిర్వహించిన పోటీలలో అండర్ -17 బాలికల విభాగంలో ప్రహర్షిణి (ఒక్లే స్కూల్ ఐ) ప్రథమ స్థానం,భావన (జెడ్ పి హెచ్ ఎస్ వెల్లుల్ల )ద్వితీయ స్థానం, అండర్ -17బాలుర విభాగం లో విష్ణు (వివేకానంద విద్యానికేతను )ప్రథమ స్థానం, శ్రీహన్స్ (ఒక్లే స్కూల్ )ద్వితీయ స్థానం, అండర్ -14 బాలికల విభాగంలో శివాని ( మహాత్మా జ్యోతిభపూలే గురుకులం,మెట్లచిట్టాపూర్ )ప్రథమ స్థానం,మోక్ష (అక్షర హై స్కూల్ )ద్వితీయ స్థానం, అండర్ -14 బాలుర విభాగం లో వేదాంత్ (ఒక్లే స్కూల్ )ప్రథమ స్థానం, మహేందర్ (ఒక్లే స్కూల్ )ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయికి మెట్టుపల్లి మండలం నుండి ఎంపికయినట్లు మండల ఎస్ జి ఎఫ్ సెక్రటరీ కొమురయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు వెల్లుల్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి మెమెంటో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యాయమ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, రాజేష్, శివ మాధవిలత, కార్తీక్, ప్రయోగిలు ప్రదీప్ లు పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సప్లయర్స్ అసోసియేషన్ వినతి

**-సకాలంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక గాంధీ సర్వజన ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఉషారాణిని ట్విన్ సిటీస్ హాస్పిటల్ సప్లయర్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఆసుపత్రికి నిరంతరాయంగా ఔషధాలు, సర్జికల్ ఉపకరణాలు, వైద్య సామగ్రిని సరఫరా చేస్తున్న ఏజెన్సీలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గత కొంతకాలంగా వివిధ సరఫరాలకు సంబంధించిన బిల్లులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం వల్ల తాము తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని సూపరింటెండెంట్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరాదారులకు రావాల్సిన బకాయిలు నిలిచిపోవడంతో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించలేక, రోజువారీ వ్యాపార నిర్వహణ భారంగా మారిందని వారు వివరించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం సేవలు అందిస్తున్న సరఫరాదారుల పరిస్థితిని గుర్తించి, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని వారు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా బిల్లుల చెల్లింపులు క్రమం తప్పకుండా జరిగేలా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని కోరారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న నూతన సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ బిల్లుల విడుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ట్విన్ సిటీస్ హాస్పిటల్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే.బి. రామచంద్రతో పాటు ముఖ్య ప్రతినిధులు రఘు, మతిన్ పాషా, మధు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొల్లపల్లి మండల పరిషత్ పరిషత్ కార్యాలయంలో ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు



**గొల్లపల్లి 09 సెప్టెంబర్ ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రజాకవి కాళోజీ నారాయ ణరావు జయంతి వేడుకలు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కాళోజీ నారాయ ణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీందర్ రావు,మాట్లాడుతూ, సాధారణ ప్రజానీకానికి అర్థమయ్యేలా తెలంగాణ యాసలో ఎన్నో కవితలు రచించి, ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ సేవలకు కేంద్ర ప్రభుత్వం 1992 లో పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిందని చెప్పారు. ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కాళోజీ లాంటి గొప్ప వ్యక్తుల జయంతులను ఈ విధంగా అధికారికంగా నిర్వహించుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇటువంటి మహనీయుల జయంతి ఉత్సవాల అధికారికంగా నిర్వహించడం ద్వారా భావితరాల వారికి వారి గొప్పతనాన్ని తెలియజెప్పిన వారిమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రావు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్లు సర్పంచులు మండల అధికారులు కంప్యూటర్ ఆపరేటర్ పవన్ కుమార్, శ్రీకాంత్, చంద్రశేఖర్, ఆదిల్, జగన్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేస్తున్న పొదుపు సంఘం సమితి అధ్యక్షుడు కంచర్ల శంకరయ్య, పాలకవర్గ సభ్యులు

**మృతుడి కుటుంబానికి వివేకానంద పురుషుల పొదుపు సంఘం -2 చేయూత..**



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 9 ప్రజా మంటలు :** మండల కేంద్రానికి చెందిన గొడిశాల విజయ్ కళ్యాణ్ (35) ఇటీవల మరణించగా వారి కుటుంబానికి బుధవారం రోజున వివేకానంద పురు ష ల పొదుపు సంఘం-2 సమితి అధ్యక్షుడు కంచర్ల శంకరయ్య, పాలకవర్గ సభ్యులు పన్నెండు వేయిల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పొదుపు సంఘం లో సభ్యత్వం తీసుకుంటే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కొంత వారి కుటుంబానికి భరోసా కల్పించినట్లు అవుతుందని అన్నారు. కావున18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సహాయం అందజేసిన పొదుపు సంఘం పాలకవర్గ సభ్యులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వివేకానంద పురుషుల పొదుపు సంఘం-2 అధ్యక్షుడు పోగుల ప్రభాకర్( ఆర్.ఎం.పి ) ఉపాధ్యక్షుడు రమేష్, శీలం అనిల్ కుమార్, దాసరి రవి, గోడిశాల కిషన్, బోనగిరి నాగరాజు, కొత్తకొండ సదానందం, గణకుడు అల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ విద్యార్థుల స్టైఫండ్‌ను భారీగా పెంచిన తెలంగాణ ప్రభుత్వం

**అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్‌ల పెంపు**

**గత పదేళ్లలో ఒక్కసారీ పెంచలేదని విద్యార్థుల ఆవేదన**

**సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు**

**ఆయుష్ బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్న ప్రభుత్వం**



తెలంగాణలో ఆయుష్ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వారి స్టైఫండ్‌లను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయుర్వేద, హోమియోపతి, యునాని, నాచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌లను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమాన స్థాయికి పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నిర్ణయంతో హౌస్ సర్జన్ల నెలవారీ స్టైఫండ్ రూ. 13,754 నుంచి రూ. 29,792కు పెరిగింది. అదేవిధంగా, పీజీ విద్యార్థుల స్టైఫండ్ రూ. 34,385 నుంచి ఏకంగా రూ. 74,482కు పెరిగింది. తమ చిరకాల డిమాండ్‌ను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయుష్ విద్యార్థులు, వైద్యులు బుధవారం సచివాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.గత పదేళ్లలో గత ప్రభుత్వం తమ స్టైఫండ్‌లను ఒక్కసారి కూడా పెంచలేదని, దీనివల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. తమ సమస్యను అర్థం చేసుకుని, అల్లోపతి విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్య మంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా రాణించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టామని తెలిపారు. సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్‌లలో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేశామని, కరీంనగర్‌లో రూ. 15 కోట్లతో మరో ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.సాంప్రదాయ వైద్య పరిజ్ఞానాన్ని ఆధునిక పద్ధతులతో అనుసంధానిస్తూ పరిశోధనల వైపు దృష్టి సారించాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా పేద, గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని ఆయుష్ ఆసుపత్రులను, క్లినిక్‌లను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.



